# మమకారం

**పాటిమళ్ల రామకృష్ణ.**

మూడో వరంగా నచికేతసుడు యముణ్ణి మానవుల మరణానంతరవిషయం కోరాడు. దానికి ఆయన "నూరు సంవత్సరాల వయస్సూ, పుత్ర పౌత్రుల్నీ, రాజ్యాలనూ కోరుకోగాని మరణానంతర విషయాల్నిమాత్రం అడక్కు" అన్నాడుట. నచికేతసుడు, "మరణానంతరం కొందరు ఆత్మవున్నదంటారు. కొందరు లేదంటారు. ఆ సంగతేవిటో నాకు సవిస్తరంగా తెలుప వలసింది" అనడిగాడు. అందుకు యముడు "అదిమాత్రం అడుగరానిది" అని ప్రత్యుత్తర మిచ్చాడు.

యముడంతటివాడు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా తప్పించుకో జూచినప్పుడు, మనం, మానవ మాత్రుల్లం ఏపాటి? అని "కుటుంబయ్య"గారు వితర్కించుకున్నారు. ఆయన యీ మధ్య కొంతకాలం నుంచి ప్రశాంతంగా కాలంగడుపుతున్నారు. వృద్ధాప్యం మీదపడింది. శరీరంలో పటుత్వం తగ్గింది. ప్రాపంచిక వాంఛలూ, సుఖదుఃఖాల్లో యింకా కొట్టుమిట్టాడుతూ, ముక్తిమార్గాన్ని కలుషాయితం చేసుకొంటూ జీవించడం "మూర్ఖం" అని ఆయన నిర్ధారించుకొన్నారు. పుత్రుల్ని చదివించారు. విజ్ఞానుల్ని చేశారు. కష్టించి కూడబెట్టగా శేషించిన యావత్తూ వాళ్ళపరం చేశారు. "మీరు తింటే నాకూ యింత పెట్టండి. మీకు లేకపోతే నేనూ మీతోబాటే! కాని నా ప్రశాంతతనుమాత్రం భంగపరచకండి" అని అందరితోనూ చెప్పారాయన. పెద్దమ్మాయి 'శశి' అత్తవారింటికెళ్ళింది. నేడో రేపో 'సీత' కూడ వెళ్ళిపోతోంది. కోడళ్ళొచ్చారు. కుమారులిద్దరూ ఉద్యోగాల్లో చేరారు. ఇక ఆ గృహంలో చింతకు స్థానంలేదు.

కుటుంబయ్యగారి గృహిణి నాలుగేళ్ల క్రితం పరలోకగతురాలయింది. ఆయన తండ్రిగారు మహాపండితులు. అందువల్లనే కుటుంబయ్యగారు సంస్కృతాంధ్రాల్లో సమానపాండిత్యం గడించారు. ఎల్లప్పుడూ గీతావాక్యం మననం చేసుకొంటూవుంటారు.

ప్రపంచం తనదారిన తాను పురోగమిస్తోంది. వ్యక్తిగతాభిప్రాయాలకు ప్రకృతి ఎక్కడా ప్రాధాన్యం ప్రసాదించినట్టులేదు. నింగిని మేఘాలు ఆవరిస్తూనే ఉన్నాయి. పర్వాలు వీలయినప్పుడల్లా ప్రాణుల్ని కాటందుతూనే వున్నాయి. ప్రాణుల్ని విజాతులు భక్షిస్తూనే వున్నాయి. కాలచక్రం పరిభ్రమిస్తూనే ఉంది. జననం, మరణం నైజదృష్టి మరల్చలేను. ప్రాణుల మంచిచెడ్డల్నీ, అందచందాలను, వివేకాలను గుర్తించకుండా, విచక్షణారహితంగా మృత్యువు కబళిస్తూనేయుంది.

"దుర్మార్గులు పూర్వం వున్నారు. నేడూ వున్నారు. వాళ్లని పూర్వం ఒక జాతిగాజేసి రాక్షసులు అన్నారు. అదను జూసుకొని అందినవాళ్ళని భక్షిస్తూండేవాళ్లు. ఆ దుర్మార్గులే నేడూ వాళ్ళ రూపాలు మార్చుకొని మనలోనే, మనలానే, మసలటం నేర్చుకున్నారు. అంతే విశేషం నేటికీ నిన్నకీ" అని కుటుంబయ్యగారు ఒక కాగితంమీద వ్రాసుకొని పెట్టెలో పెట్టుకున్నారు. ఇలా చెయ్యడం వారి కలవాటు. అప్పుడప్పుడు దాన్ని తీసి ప్రతి అక్షరంవంకా తీక్షణంగా, నిశితంగా అవలోకించి తిరిగి దాచేస్తూంటారు.

నేటివరకూ సంసారాన్ని ఏ కొరతా లేకుండా ఆయన తీర్చి దిద్దుకొచ్చారు. ఇప్పుడొక్కసారిగా ఆయన ఆరంగాన్నుంచి విరమించుకొనేసరికి కొడుకులు వుక్కిరిబిక్కిరయ్యారు. సలహాలకు మాటిమాటికి తండ్రిదగ్గర కొస్తూండేవారు.

సృష్టిని వితర్కించుకొంటూ మధ్య మధ్య మను ధర్మశాస్త్రంలోని ముక్కలు చదువుకొంటూ కూర్చున్న కుటుంబయ్యగారికి అనూహ్యమైనవార్త మను కొరప్రవంతినిపొంగించి ప్రాంతీయ జ్ఞానాన్ని మునిగిపాయేట్లుచేసింది. పెద్దమ్మాయి 'శశి' కి మనూచికంపోసి నెలరోజులుగా చివికి, చివికి, జీర్ణించి,నశించిపోయింది. పితృహృదయం తల్లడిల్లింది. ఆయన భోరునఏడ్చారు, చంటిపిల్లవానిలా...

కుటుంబయ్యగారికి తీర్థయాత్రలు చెయ్యాలని సంకల్పం కలిగింది. ఇంట్లో నలుగురితో చెప్పారు. "ఒక్కడివే ఎలా వెడతావు నాన్నా! మనవూరునుంచి వెళ్ళేవారెవరయినా వుంటే చూడు. తోడు తీసుకుని వెడుదువుగాని..." అన్నాడు పెద్దాడు.

"పెద్దదిక్కు లేకుండా వెళ్ళిపోతే ఎలా నాన్నా!......ఏచింతా లేకుండా యింటిపట్టునే భగవద్ధ్యానం చేసుకొంటూండక్కూడదా!" అన్నాడు చిన్నబ్బాయి.

కుటుంబయ్యగారు అందరికీ 'ఆత్మశాంతి కోసం' అని సమాధానంచెప్పి ప్రయాణానికి సంసిద్ధులయ్యారు. కొడుకులూ, కోడళ్లూ ఆయన సామానంతా సర్ది కావలసిన అన్ని సదుపాయాలూ కలిగించారు. రెండోవాడు బెజవాడవరకూ వచ్చి తండ్రిని పెద్దబండీలో ఎక్కించాడు. "నాన్నా! లెక్కకు ఏమీ ఇబ్బంది పడకు. రెండు రోజులు ముందుగానే ఒక కార్డు వ్రాసి పారేయ్! నేపంపుతా...అన్నాయ్ విస్పించుకోడులే" అన్నాడు.

"తండ్రీ! నీ దగ్గరకొస్తున్నా! నాకు జ్ఞానం ప్రసాదించు. సంకుచితత్వాన్ని; స్వార్థాన్నీ నాలో నశింపచేయి"అని చేతులు జోడించి ప్రమొక్కారు కుటుంబయ్యగారు. రైలు కదిలింది.

మదరాసు చేరుకున్నారు. ఒకతన్ని తనకు కావలసిన రైలును గురించి విచారించారు. అదృష్టవశాత్తూ అతడూ ఆంధ్రుడే! కుటుంబయ్యగారి గమ్యస్థానం తెలుసుకొని వివరాలు చెప్పాడు.

కావలసిన పళ్ళూ వగయిరాలు తీసికొని ఎక్కవలసిన బండీలో ఎక్కారు. ఆయన ప్రస్థానకాలమంతా భగవద్ధర్మనాతురులై ఉండటంవల్ల అన్యమనస్కంగానూ, మౌనంగానూ, గడుపుతున్నారు.

'వృద్ధాచలం'లో ఒక మహమ్మదీయుడు కుటుంబయ్యగారి ప్రక్కను కూర్చోడం తటస్థించింది.

అతను "పండిట్ జీ! ఎందాక?" అని ప్రశ్నించాడు హిందీలో. కుటుంబయ్యగారికి హిందీ రాదుగానీ ప్రయాణాలలో సాధారణంగా ఎవరయినాఅడిగేది ఆప్రశ్నే కాబట్టి ఆయన వెంటనే 'రామేశ్వర్' అన్నారు.

"మీకు హిందీ రాదూ?" అన్నాడు ఆయన్ని. కుటుంబయ్యగారు తల అడ్డంగా త్రిప్పారు. కానీ వెంటనే 'సంస్కృతం' వచ్చు అన్నారు.

"ఓ! సంస్కృతం వచ్చునా అయితే ప్రయాణం దుర్భరం, అనుపయోగం కాదన్న"మాటఅన్నాడు మహమ్మదీయుడు సంస్కృతంలోనే.

కుటుంబయ్యగారు కించిదాశ్చర్యం ప్రకటిస్తూ "మిత్రమా! నీ వెక్కడికి?" అని ప్రశ్నించారు.

"ప్రపంచం దుర్భరమైంది. వయస్సు బుద్బుదమైంది. మనసుకు కళ్ళెం వేసి యాత్రార్థం బయలుదేరాను. నేనూ మీ

# ★ మమకారం ★

తోనే వస్తున్నాను" అన్నాడతను.

కుటుంబయ్యగారు అతన్ని పరిచయం చేసుకున్నారు. అతని జీవిత నిమ్నోన్నతాల ఫలితాలు విన్నారు. అతనూ మతగ్రంథాలన్నీ తిరగేశాడు. నాలుగయిదు భాషలు ధారాళంగా మాట్లాడగలడు. హైస్కూల్లో ఆరేళ్ళక్రితంవరకూ వుపాధ్యాయ వృత్తిలో వుండి ప్రస్తుతం విరమించుకున్నాడు.

"కృష్ణుడు చెప్పినా, క్రీస్తు చెప్పినా, కొరాను చెప్పినా అంతా ఒకటేగదా ఆర్యా! 'నన్ను జ్ఞాపకముంచుకొనుడు; నేను మిమ్ములను జ్ఞాపకముంచుకొందును; నాకే నమస్కృతులర్పింపుడు. నాయెడల విశ్వాస ఘాతకులై యుండకుడు. కృతజ్ఞతతో నుండుడు" అని వుంది కొరానులో.

"తేషామహం సముద్ధర్తా
మృత్యుసంసార సాగరాత్
భవామి న చిరాత్పార్థ
మయ్యావేశిత చేతసామ్"

అన్నాడు కృష్ణభగవానుడు. స్వామీజీ! ఏమిటీ భేదం? ఎందుకు లోకం మతద్వేషాల్ని పెంచుకొని స్వార్థబుద్ధితో సంకుచించుకొంటుంది? నేను జీవితాన్ని వృథాచేశాననే వ్యథతో కుమిలిపోతున్నాను. నాకు యీ సత్యం తెలిసివుంటే ఎన్నడో ప్రపంచానికి దూరంగా వుండేవాడిని," అని నజీరుద్దీన్ దీనవదనంతో చెప్తుంటే కుటుంబయ్యగారు తన ఏకీభావాన్ని తెలియజేశారు.

నజీరుద్దీనకు ఏభయ్యైదేళ్లుంటాయి. డెబ్బది ఏళ్లు మీదపడ్డ కుటుంబయ్యగార్ని చూసి, ఆయన ఒంటిపాటు ప్రయాణానికి నొచ్చుకుంటూ "మీకోసం నేను ముందుస్టేషనులో పాలు సంపాదించి తీర్తాను. మీరు పాలైనా పుచ్చుకోకుండా ప్రయాణం చేయడం చాల కష్టం. నాకు అది సమ్మతికాదు" అన్నాడు.

అన్నట్టే నజీరు పాలు తెచ్చాడు. కొసిని పాలు కుటుంబయ్యగారు త్రాగి, రైలు బయలుదేరబోతూండగా వాంతి చేసుకొన్నారు. తరువాత ఆయాసపడ్డారు. ప్రాణం కడబట్టినట్లు ఉక్కిరిబిక్కిరయింది. కండ్లు మూసుకుని 'తస్య బ్రహ్మలలాటస్థో, రుద్రో వక్షసి వా భవత్' అని విరాట్ రూపాన్ని తల్చుకుంటూ వుండిపోయారు. నజీరుకూడ వారికి ఆరోగ్యాన్ని చేకూర్చమని భగవానుని ప్రార్థించాడు.

"టికెట్" అంటూ వచ్చాడు టి.సి. నజీరు తన టిక్కెట్టు చూపించి, వారి టిక్కెట్టు ఎక్కడుందో తెలియదు. కొంచెం ఆగిరండి" అన్నాడు.

"అదంతా పనికిరాదు. అసలు టిక్కెట్టు లేదల్లేవుంది. అందుకే ఆ దొంగవేషం" అన్నాడు కర్కశంగా టి. సి.

నజీరు వెంటనే అందుకుని "మీలో మానవత్వం కనుపించదే? మీకు ముసాఫిర్లమీద 'చెకింగ్' అధికారం వుంటేవుండనీ. అసలు జబ్బుగావున్న ముసాఫిర్నుగురించి రైల్వే కంపెనీచేసిన రూలు తెలుసా మీకు?... పరిస్థితి అవగాహన చేసుకోండిసార్. మనమూ వృద్ధులమౌతాం. అలా అందర్నీ చూసిరండి. ఈలోపున వారు కండ్లు తెరువవచ్చు" అని యింగ్లీషులో గట్టిగా సమాధానం చెప్పేసరికి టి. సి. వెనక్కు తిరిగాడు. ఇంతలో కుటుంబయ్యగారు మెల్లిగా లేచి జొడ్డునవున్న 'టిక్కెట్టు' తీసి నజీరుకు యిచ్చారు. అతను 'టిక్కెట్టు' చూపించాడు.

సంధ్యాసమయానికి బండి గమ్యంచేరింది. కుటుంబయ్యగారు దైవదర్శనానికి ఆత్రుతపడ్డారు. ఆ రాత్రికి ధర్మశాలలో బసచేసి మరునాడు ఆలయాలు చూశారు.

ఆ రాత్రి కుటుంబయ్యగారికి నిద్రపట్టలేదు. తెల్లవార్లూ దైవాన్ని గూర్చి యోజిస్తూనే వున్నారు. పాండవకుండాలలోనూ, ధనుష్కోడిలోనూ, స్నానాలు చేశారు.

భగవానునిముందు నిలబడి తదేక దృష్టితో చూస్తూండగా 'నతుమాంశక్యసే ద్రష్టు మనేనైవ స్వచక్షుషా, దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగ మైశ్వరమ్!' అని వారి మనసులో మెదలింది. వారు పులకించారు.

'ప్రియజనుల హావభావములను తలచుకొంటూ యింతఆప్తులు మరియొకరు లేరని కీర్తించడాన్ని గుణసంకీర్తనం' అన్నాడు నారదుడు. జయదేవుడు, లీలాశుకుడు మొదలయినవారు యీ గుణసంకీర్తనం వల్లనే దైవకృపకు మార్గం వేసుకున్నారు.

'సర్వకాల సర్వావస్థలయందు భగవన్నామసంకీర్తనంవల్ల భక్తులందరూ తరించారు. ఇది నామసంకీర్తనం. మనసుయొక్క వేగాన్ని తగ్గించి కేంద్రీకరించేందుకు మార్గాలు యివే' అనుకున్నారు కుటుంబయ్యగారు.

నజీరు ఎప్పుడూ తర్కిస్తూనే వుండే



వాడు. కావలసిన గ్రంథాలు కుటుంబయ్యగారివద్దతీసికొని కూలంకషంగా చిలుకుతూండేవాడు. ఖొరాన్‌తో పోలుస్తూ "అంతా ఒకటే" అని తన అభిప్రాయాన్ని స్థిరీకరించుకున్నాడు. "సూర్యోదయం మొదలు తిరిగి సూర్యోదయంవరకూధ్యానం చెయ్యాలి. అర్ధరాత్రి సైతం నిద్రమాని ధ్యానం చెయ్యాలి. అప్పుడే భగవంతు డనుగ్రహిస్తాడు" అని వుందన్నాడు నజీరు.

ఇరువురూ ప్రతిదినం ఆలయాలకు వెళ్ళి వస్తూండే వాళ్లు. కుటుంబయ్యగారి ఆరోగ్యం సరిగా వుండటంలేదు. "పోనీ...యీ పవిత్రక్షేత్రంలోనే కలిసిపోతాను" అనుకున్నారాయన.

ఓ రోజున యింటివద్దనుండి వుత్తరం వచ్చింది. కుటుంబయ్యగారు దానిని తెరచి చూడాలనే ఉద్దేశ్యం అణచివేశారు. ఆ లిప్స అంతరించేలోగానే వారికి ఆప్తులంతా కళ్లకు కట్టినట్లు కన్పించారు. వారి క్షేమ సమాచారాలకోసం పితృహృదయం తల్లడిల్లింది. తన బిడ్డలు ఎలా వున్నారో? పెద్దమ్మాయ్ అలా అన్యాయం చేసిపోయింది. పెద్దాడు, చిన్నాడు సఖ్యతగా వుంటున్నారో లేదో? చిన్నమ్మాయ్ కాపురమెట్లా వుందో? ఈ ప్రశ్నలన్నీ సాగరంలోని కెరటాలవలె వెంటవెంటనే వచ్చి ఆయన్ను వూపిరి పీల్చనివ్వలేదు.

వెంటనే లేచి వెళ్ళి వుదయంవచ్చిన వుత్తరాన్ని విప్పి అంతా చదివారు. ఆయన మనస్సు క్షోభించిపోయింది. కన్నులవెంట అశ్రుకణాలు వుద్భవించి చెక్కిళ్లవెంట కారుతున్నాయి. 'చిన్నాడికి కలరా తగిలింది'.

* * *

రైలు అతివేగంగా ఆంధ్రదేశంవేపు దూసుకుపోతోంది. వెనక్కు తగ్గుతున్న ప్రకృతిని చూస్తూ కుటుంబయ్యగారు దుఃఖభారాన్ని దిగమ్రింగేందుకు ప్రయత్నిస్తున్నారు.


తన నిష్ఠ మంటగలసింది. ఆప్తులమీది మమకారం చావలేదు. మనస్సు పరాధీనమౌతూంటే భగవానుని సన్నిధానం నిష్ప్రయోజనం. తను వయోవృద్ధుడు. విచక్షణా జ్ఞానాన్ని జీవితమంతా వడబోతపెట్టి ఆర్జించాడు. సుఖదుఃఖాల అనుభవాలు జీర్ణించిపోయాయి. మరణాలు తను చాలా చూశాడు. మరణం అనేది జీవికి ఆఖరి అనుభూతి. జీవితంలో దేన్నుంచిఅయినా దూరం కావచ్చుగాని మరణాన్ని మాత్రం తప్పించుకోలేడు. ఇది తనకు తెలిసినసత్యం. కాని తాను "తన, పర" భేద భావం కలిగించుకొని వుండటంవల్లనే మనస్సు అనేది తనవాళ్లవేపు పరుగిడుతోంది. తను జీవితంలో సాధించింది ఏమిటి?...చివరికి మృత్యువు తన్ను సమీపించే అంతిమ ఘడియల్లో మిగిలేదేమిటి? తర్వాతమాత్రం తాను గానీ, తన ఆత్మ గానీ శేషించగలగటం సాధ్యమా? భగవానుడు తనవంటి కూపస్థమండూకాలకు చూపిన సుసాధ్యమయిన, అనపాయకరమైన మార్గాన్ని తానెందుకు గుర్తించి పురోగమించలేకపోతున్నాడు. ఎంత మాఢ్యం! పంకిలంలో పడిపోతున్నాడు తాను.

కుటుంబయ్యగారు యీ సుదీర్ఘమయిన ఆలోచనతో చలించిపోయారు. చైతన్యం సన్నగిలుతున్నట్లు గోచరించసాగింది. జగత్తు కళ్లముందు పరిభ్రమించి మిరుమిట్లు గొల్పింది. అవయవాలు పట్టుతప్పుతున్నై.

రైలు ఒక స్టేషనులో ఆగి మళ్ళీ బయలుదేరింది. వెలుగుతూన్న గుడ్డిదీపంకాంతిలో మూలగా కూర్చున్న కుటుంబయ్యగారి స్థితిని జోగుతూన్న ప్రయాణీకు లెవరూ గుర్తించలేదు.

కుటుంబయ్యగారు మెల్లగా గొణుగుతున్నారు. 'జాతస్య మరణం ధ్రువం' అని.

కుటుంబయ్యగారు ఒకసారి భగవంతుని ధ్యానించుకున్నారు. అంతే! ఆయన జీవన జ్యోతి అంధకారంలో కలసిపోయింది. రైలు ఆయన స్వగ్రామంలో ఆగి మళ్ళీ బయలుదేరి వెళ్లిపోయింది. ఎటో? ★

చర్మపుబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మబాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చుడంలో అద్భుతంగా పనిచేసుంది.




బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు:

దిసౌత్ ఇండియన్
మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్
విజయవాడ, సికింద్రాబాద్.
బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

ఓం తత్ సత్

కే. టి. కృష్ణమూర్తి అచారిగారి

"మేల్ మాయిల్ మందు"



ప్రపంచంలో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్ఠరోగ నివారిణి
భయంకరమైన మేహవ్యాధివల్ల కష్టపడు వారలకు
పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి.
మేహరోగి నివారణ నూనె, లేహ్యం.
నల్లమేహ, ఎర్రమేహ, పొడలు మేహరణములు, తిమ్మర్లు, మతిమాంద్యము, కుష్టములు, పిత్తకారికము, సూతకవ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్ల చేతులుమంట, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం, మూలవ్యాధి, మలబద్ధంమొదలైనఅన్నివిధముల దుర్ పీడావ్యాధులను పోగొట్టును.
40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యం రు. 6/- తపాల్ ఖర్చులువేరు.
వివరములకు కేట్లాగులో చూడవచ్చును.

కే.టి.కృష్ణమూర్తి అచారి & సన్సు, 5/22, మేల్ మాయిల్ పోస్టు, (N.A.Dt.)